# సహగమనం




## మధురాంతకం నరేంద్ర

(గత సంచిక తరువాయి)

### 5

ఫాన్ ఆన్ చేసుకుని, తడివెంట్రుకలు ఆరబెట్టుకుంటూ కూచుంది మానస.

సాగర్ యూనివర్సిటీకి, కృష్ణమూర్తి ఆఫీసుకూ వెళ్ళిపోయారు.

అన్నపూర్ణ వంటగదిలో వుంది.

వాణిజ్య ప్రసారవిభాగంవాళ్ళ 'జనరంజని' సైతం ముగియడంతో, ట్రాన్సిస్టరు నోరు కట్టేసి చాలా సేపయిపోయింది.

యిల్లంతా నిశ్శబ్దంగావుంది.

గడచిన రాత్రి చాలా సేపటివరకూ మానసకు నిద్రపట్టలేదు. తెల్లవారు జామున, యెప్పుడో ఆదమరచి నిద్ర పోయింది.

ఉదయం యెనిమిది గంటలు దాటుతున్నా మెలకువ రాలేదు. అన్నపూర్ణ "యిదేం మొద్దునిద్రే నీకు? నిద్రపోయింది చాలుగానీ లే పైకి" అంటూ విసుక్కుంటూ లేపి కూచోబెట్టింది. కూచోవడానికిసైతం వోపికలేకపోయింది ఆమెకు. మళ్ళీ పరుపైన వాలిపోయింది. వొళ్ళంతా సూదులతో కుచ్చినట్టుగా చీకాకు కలుగుతోంది. తలపైన యేదో బరువున్నట్టుగా భారంగా తోచింది. కళ్ళు తిరుగుతున్నాయి. కడుపులో యేదో హడావుడి జరుగుతున్నట్టుగా అనిపిస్తోంది. గట్టిగా కళ్ళు మూసుకొంది. అయిదు నిముషాల తరువాత మళ్ళీగదిలోకొచ్చిన అన్నపూర్ణ విస్తుపోయింది. పరుపైన కూర్చుని "గంట యెనిమిదన్నరయిపోయింది. ఇంకా పడుకుంటే యెలా చెప్పు? లేచి ముఖం కడుక్కో.... టిఫెను చల్లారిపోతోంది" అంది. మానస బలవంతంగా కళ్ళు తెరచి చూచింది. "అలా వున్నావేమిటి?" కంగారుగా మానస నుదిటిపైన చేయి వేసింది అన్నపూర్ణ. చల్లగానేవుంది యెందుకలా వున్నావు. నీరసంగా వుందా అంటూ ప్రశ్నించింది...."కళ్ళు తిరుగుతున్నట్టుగా వుందమ్మా" అంది మానస...."యెందుకుండదు చెప్పు? రాత్రి అన్నం తిన్నావా నువ్వు? పిలిచి పిలిచీ నా నోరే నొప్పెట్టిపోయింది. తీరావచ్చి కూచున్నాక రెండు మెతుకులయినా తిన్నావా? లే, లేచి ముఖం కడుక్కో.... కడుపులో యేమీ లేకపోతే అలాగే వుంటుంది. ముందు కొంచెం కాఫీయిస్తాను. తాగేసి ముఖం కడుక్కో టిఫెను తిన్నావంటే వొళ్ళు కొంచెం తేలికబడుతుంది. స్నానం కావాలంటే నిదానంగా చెయ్యొచ్చు...."....వో గ్లాసు కాఫీ తాగినతరువాత బాత్రూంకెళ్ళి ముఖం కడుక్కొంది మానస. డ్రెసింగ్ టేబుల్ దగ్గరికొచ్చి కూర్చొంది. యెలుకలు తొలుస్తున్నట్టుగా కడుపులో బాధ....ఆకలేమో! యిడ్లీప్లేటు ముందు కొచ్చింది. యిడ్లీ యెందుకో చేదుగావుంది. రెండు తినగానే దోకొస్తున్నట్టుగా తోచింది. రెండు గ్లాసుల మంచినీళ్ళు తాగి చేతులు కడుక్కొంది. "అప్పుడే లేచావేమిటీ?" అన్నపూర్ణ టేబులుదగ్గరికి పరిగెత్తుకొచ్చింది...."యిక తినలేనమ్మా"... తన గదిలోకొచ్చి వాలుకుర్చీలో కూర్చొంది. గ్లాసునిండా గ్లూకోజునీళ్ళు తీసుకొచ్చింది అన్నపూర్ణ — యిదయినా తాగు ... యింతకూ స్నానంచేస్తావా, లేదా?"...."చేస్తాన్లే....హీటర్ ఆన్ చేయి...." ఖాళీగ్లాసు తీసుకుని అన్నపూర్ణ వెళ్ళిపోయింది. మానస కళ్ళు మూసుకుంది. అయిదు నిమిషాలు గడిచాయి.... వోపిక చేసుకుని బాత్రూంకెళ్ళింది. యెంత ప్రయత్నించినా మత్తు వదలడంలేదు. చికాకుపడుతూ, నీళ్ళు నెత్తిపైన దిమ్మరించుకుంది. స్నానం చేయగానే, వొళ్ళు కొంచెం తేలికపడినట్టుగా తోచింది. "అదేమిటి?....వొంట్లో నలతగావుందన్నావు. యిప్పుడు తలస్నానం చేశావేమిటి?"....మానస సమాధానం చెప్పలేదు. ఫాన్ ఆన్‌చేసి తలార్చుకుంటూ కూచుంది.

షాంపూ పరిమళం ముకుపుటాల్ని ఘాటుగా స్పృశిస్తోంది.

టర్కీ టవల్ని పరుపైనే పరచి పెట్టి, బ్రష్‌తో చిక్కుతీసుకుని, వదులుగా జడ అల్లుకొంది.

యేం చేయాలో తోచలేదు.

బీరువా తెరచి, పుస్తకాల రాక్‌లోంచీ 'గీతాంజలి' అందుకొంది.

పేంకుర్చీలో కూచుని పేజీలు తిప్పసాగింది.

పుస్తకంలోంచీ ఫోటో వొకటి జారి, వొళ్ళోకి పడింది.

ఫోటోను చేతికి తీసుకొంది.

తన పెళ్ళినాటి ఫోటో.... చిరంజీవీ, తానూ.... కొద్దిరోజుల మునుపటి వరకూ టీపాయ్‌పైని ఫోటోఫ్రేమ్‌లో వుండేది.' అపరిచితులను చూస్తున్నట్టుగా, ఫోటోవైపు నిర్వికారంగా చూడసాగింది మానస.

టీపాయ్ వైపుకు చూసింది.

ఖాళీ ఫోటో ఫ్రేం సైతం లేదక్కడ.

'చిరంజీవిని గుర్తుకు తెచ్చే వస్తువుల్ని గదిలోంచీ తొలగించడం కోసం అమ్మ చాలా శ్రమ తీసుకున్నట్టుంది. ఆరునెలల తరువాత మళ్ళీ అదే ఫోటోఫ్రేం

తీసుకొచ్చి పెడుతుందేమో యిక్కడ ! కానీ అప్పుడు, అందులో పాత ఫోటోకు బదులుగా కొత్తఫోటో వొకటి వుంటుందేమో ! అందులో'....

మానసకు హృదయం బరువెక్కినట్టుగా తోచింది.

'తనపైన తనకే అసహ్యం కలుగుతోంది— మార్గమేదయి తేనేం, సుఖ పడడమే ముఖ్యం—అంతేనా? అదే నిజమయితే నీతి, న్యాయం, ప్రేమ, అభిమానం మొదలయిన పదజాలాలని కంతా తనకు తెలియని కొత్త నిర్వచనాలేవో వుండి వుండాలి— నేను బాధలు పడినా నువ్వుమాత్రం సుఖంగా వుండాలోయ్ ! అందుకే యిలా బిజినెస్ పనుల్తో సతమత మవుతున్నాను. బాగా సంపాదించి నీ కోరికలన్నీ తీర్చేసెయ్యాలి— అనేవాడు చిరంజీవి. తనను సుఖపెట్టడం కోసమేనా యిలా చేశాడు ! అతడి అస్తిత్వ మేమైపోయింది ? యెక్కడికెళ్ళిపోయాడు?.... అంతగా ప్రేమించిన వ్యక్తికి ద్రోహం చేయమని అన్నయ్య అంటున్నాడు. అమ్మానాన్నా సైతం అదే న్యాయమని అంటున్నారు.... మొన్నటివరకూ చిరంజీవి తన భర్త ! రేపటినుంచీ.... ? కట్టుకున్న చీరెను విప్పి మరో చీర కట్టుకున్నట్టు ! నిన్నటి వరకూ నమ్మినదంతా మాయని అనుకొని, రేపటినుంచీ కొత్తజీవితాన్ని ప్రారంభించాలి!.... యెంతగా మరచిపోదామన్నా మరువలేని అనుభవాలు ! మరచిపోదామనుకున్న విషయాలనే మళ్ళీ జ్ఞాపకం చేసే కోతిబుద్ధి.... పైకి వొకటి— లోపల యింకొకటి— ఆలోచనల్లో సైతం ద్వంద్వ ప్రవృత్తి....క్షణంక్షణం నటన... ప్రతి క్షణం ఆత్మవంచన....యీ పాత్రను ధరించగల శక్తి తన కెక్కడిది ?....

'గీతాంజలి'ని పక్కన పడేసింది.

అంతూపొంతూలేని ఆలోచనలు ఆమెను చుట్టిపారేస్తున్నాయి.

విసుగ్గా కణతలు నొక్కుకుంది.

టెలిఫోను గొంతు చించుకుంటోంది

హాల్లోనికి నడచి, రిసీవర్ చేతికి తీసుకుంది.

"హల్లో అమ్మా !" సాగర్ కంఠం.

"అమ్మకాదు, నేనన్నయ్యా !" అంది మానస.

"అమ్మవంటింట్లోవుందా ?..."

"అవును, పిలవమంటావా ?...."

"అవసరం లేదు. అమ్మతో వొకమాటచెప్పు...."

"మధ్యాహ్నం లంచ్‌కి నాతో బాటూ వొక ఫ్రెండు వస్తున్నాడు...."

"..........."

"యెవరని అడగవేం ?"

"......"

"రాజేష్ వస్తున్నాడు."

తనను తాను తమాయించుకొని, ఆదుర్దాను కప్పిపుచ్చుకోవాలని విఫల ప్రయత్నం చేస్తూ "అమ్మతో చెబుతాను" అంది.

"అశోకవనంలో సీత పోజును కొంచెం కట్టిపెట్టి, హుందాగా కనిపించాలి మువ్వు...."

మానస చీకాకు పడిపోయింది "అంతేనా" యిక వుంటాను."

"అలాగే, మధ్యాహ్నం వొంటిగంటకంతా అక్కడుంటాము...."

రిసీవర్ని వుంచేసి, వంటగదిలోకి వెళ్ళి తల్లికి వర్తమానాన్ని చేరవేసింది.

"ఫ్రెండంటే యెవరూ, రాజేష్షేనా" అంటూ అడిగింది ఆమె.

మౌనంగా వెనక్కొచ్చేసింది.

'అంతా ప్రిప్లాన్....' మానస మళ్లీ వోసారి తనను తాను అసహ్యించుకొంది.... 'అందరూ కలసి తన జీవితంపైన ఎక్స్‌పెర్మెంట్ చేసి పారేస్తున్నారు. లాబొరేటరీలో యెలుకపిల్ల....గినియాపిక్....జీవితమయితే తనది గానీ, దానిపైన నిర్ణయాలు మాత్రం తనవిగావు. అమ్మా, నాన్నా, అన్నయ్యా, ప్రపంచమూ— అందరూ తనపైన అధికారాన్ని చలాయించే వారే ! తానొక బానిస....ఆలోచించగలశక్తి వుండీ, అసహాయురాలై పోతున్న నిత్యపృజన్మ....చిరంజీవిని పెళ్లి చేసుకో....యిప్పుడిప్పుడే వొద్దు, నేను చదువుకోవాలి....లాభం లేదు. అది ఆజ్ఞ.. రాజేష్‌ను పెళ్లాడు—అడ్డు చెప్పడానికి తన గొంతు పెగలదేం ?— నీమంచికోరే చేస్తున్నాము. అప్పుడే స్వంత నిర్ణయాలు తీసుకునే శక్తి వచ్చిందానీకు ?— రాలేదా మరి ? యెప్పటి కొస్తుంది !....తన జీవితం తన అదుపులో లేదు. తన బ్రతుకు పైన తనకే అధికారమూ లేదు...."

దిన పత్రికను అందుకుని అడ్వర్‌టైజ్ మెంట్లు చూడసాగింది. మట్టిరంగు కాగితంపైన అలుక్కుపోయినట్టున్న ప్రింటింగు....రకరకాల దుస్తుల్లో యువతీ యువకులు....అపాయింట్ మెంట్స్ కాలాన్ని వెక్కిరిస్తున్న టెండర్ నోటీసులు. పేపరు విసిరిపారేసి కళ్లుమూసుకుంది.

అరగంటసేపు గడచింది.

యింటిముందు అడుగులసవ్వడి వినిపించింది.

'గంట యింకా పన్నెండయినా కాలేదు. అప్పుడే నాన్న ఆఫీసునుంచీ



వచ్చేశాడా? నాన్న గాకపోతే మరెవరు?....'

చంద్రమౌళి, సరోజమ్మా...

ఆమె చేతిలో పళ్ళబుట్ట....

వాకింగ్ స్టిక్ టకటకలాడించుకుంటూ అతనూ....

కంగారుపడుతూ లేచి నిల్చొంది మానస.

"పర్వాలేదు కూర్చోమ్మా!" సోఫాలో కూచుంటూ అన్నాడు చంద్రమౌళి

ఆయన కంఠంలో ధ్వనించిన విషాదపు తాకిడికి మానస చలించిపోయింది. తల పైకెత్తి చూసింది.

గడచిన కొద్ది రోజుల్లో దంపతులిద్దరూ సగమైపోయారు. కళ్ళల్లోమాత్రం ప్రాణాలు గాలిలోని దీపాల్లా కొట్టుకులాడుతున్నాయి.

"అమ్మ వంటగదిలో వుందమ్మా!" సరోజమ్మ కోడలి పక్కకొచ్చికూచుని, వీపుపైన లాలనగా చేయివేసింది,

మానస తలాడించింది.

"బాగా చిక్కిపోయావమ్మా" అన్నాడు చంద్రమౌళి.

"మీరు మాత్రం ...?" మానస వాక్యాన్ని పూర్తిచేయలేక పోయింది.

"మాదేముంది? యీ జీవితంలో యింకా అనుభవించవలసిందేం మిగిలిందని? నువ్వింకా చిన్నదానివి, యీ వయసుకే యిన్ని బాధలు పడవలసి వస్తోంది. హూ!" అని నిట్టూర్పులో యెన్ని విషాదపు తుఫానులో!

సరోజమ్మలేచి వంటగదిలోపలికెళ్ళింది.

"మీ అన్నయ్య.... మొన్న.... యింటికొచ్చాడు? అతి ప్రయత్నంమీద మాటలు కూడదీసుకుంటూ చెబుతున్నాడాయన. "అంతా చెప్పాడు. మొదట... మేమిద్దరమూ చాలా బాధపడిపోయామనుకో! కానీ...ఆలోచించిన తరువాత అర్థమయింది....మంచి నిర్ణయమే తీసుకున్నాడని...."

"మీరు చెబుతున్నది.. " మానస గుక్కిళ్ళు మింగసాగింది.

"మీ అన్నయ్య తీసుకున్న నిర్ణయం గురించే! నువ్వింకా చిన్నదానివి.... పెండ్లి మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది . వాడికి లోకంతో ఋణం తీరిపోయింది. వుండి మమ్మల్ని పంపించవలసినవాడు—మాచేతులమీదుగా వెళ్ళిపోయాడు. యేడిస్తేనూ, ఆక్రోశిస్తేనూ వొరిగేదేమీలేదు....నీజీవితం మోడుగా ఎందుకు మిగలాలి? మీ అన్నయ్య చాలా మంచినిర్ణయం తీసుకున్నాడు....అసలు అప్రిసియేట్ చేయాల్సింది ఆ అబ్బాయిని....ఆ అబ్బాయి పేరేమిటి? యేదో చెప్పాడు సాగర్..."

మానసకు మళ్ళపయిన కూచున్నట్టుగావుంది. యేడుపు పొంగుకొచ్చింది. "నేను.... నేను..." మాట్లాడలేక పోయింది.

"నువ్వేమీ తప్పుచేయడం లేదులేమ్మా ! బాధపడొద్దు నువ్వు.. మీ అత్తయ్య రాద్ధాంతం చేస్తుందేమోనని మొదట భయపడ్డాను. కానీ....నీకింత అన్యాయం జరిగిపోయింది గదా అని హృదయవిదారకంగా యేడ్చిందారోజున.... మేము కోపం తెచ్చుకున్నామని నువ్వనుకుంటావేమోనని భయపడి....మేమేమీ కోప్పడడం లేదని చెప్పడాని కొచ్చాము. నీ జీవితం నాశనం కావడం మాకుమాత్రం యిష్టమా యేమయినానా ? మాకసలు కొడుకు పుట్టలేదనుకుంటాము....అనుకోవాలి....అనుకోకతప్పుతుందా చెప్పు ! నవ్వే మాకూతురి వనుకుంటాము....మళ్లీనువ్వు కళకళలాడుతూ తిరుగుతుంటేగానీ మాకు హాయిగా వుండదు. పైగా యీ పెండ్లి జరిగితే వాడి ఆత్మకు కూడా శాంతి కలుగుతుందనిపిస్తోంది. వాడిమనస్తత్వం నాకు తెలుసు. నీక జీవితం నాశనం కావడం వాడు భరించలేడు...."

యెంత ప్రయత్నించినా ఆయన తన బాధని దాచుకోలేకపోతున్నాడు. విషాదపుజీర అతడి మనఃక్లేశాన్ని స్పష్టంగా తెలుపుతూనేవుంది.

"నేనింకా యిందుకు వొప్పుకోలేదండీ...." పొంగుకొచ్చిన యేడుపుమధ్య మానస మాటలు ముద్దముద్దగా వినిపించాయి.

చంద్రమౌళి కళ్ళల్లోంచీ రెండు కన్నీటి బొట్లు కిందికి రాలాయి. లేచి, మానస దగ్గరికొచ్చినిలబడి, ఆమె తలపైన ఆప్యాయంగా చేయివేసి, "యేడవొద్దు ....యికపైన నువ్వు యేడవగూడదు. మనమంతా శాపగ్రస్తులమేమో.... లేకపోతే, యీ వయసులో మాకీ కష్టమెందుకొచ్చింది చెప్పు! నీకు మాత్రం—యేంతప్పు చేశావని నీకీశిక్ష....వొద్దుమానసా ! మరచిపో....కొత్తజీవితాన్ని మొదలుపెట్టు.... మేమిలా మళ్లీమళ్లీ నీకు కనిపించి పాత-విషయాల్ని జ్ఞాపకం చేసి బాధపెట్టాలని అనుకోవడం లేదు. కానీ యిప్పుడు రాక తప్పలేదు...." అన్నాడు.

వంటగదిలోంచీ అన్నపూర్ణా, సరోజమ్మా వొచ్చినిలుచున్నారు.

యెవరికి వారు, యేదో వొకటి మాట్లాడాలని ప్రయత్నించారు. యెవరికీ నోరు పెగలలేదు.


కాస్సేపు యెవరూ మాట్లాడలేకపోయారు.

సరోజమ్మ తనలో తాను గొణుక్కుంటున్నట్టుగా చెప్ప నారంభించింది "వొకొక్కప్పుడు యిదంతా కేవలం భ్రమ మాత్రమే-నేమో ననిపిస్తుంది. వంటగదిలో పనిచేసుకుంటూ వున్నప్పుడు, కాలింగ్ బెల్ మ్రోగుతుందేమోనని, చిరంజీవి యింటిలోపలికొచ్చి 'ఆకలేస్తుంది, అన్నం పెట్టమని అడుగుతాడేమో'నని అనిపిస్తుంది. ఆ యింట్లో ప్రతివస్తువూ, ప్రతిచోటూ వాడినే జ్ఞాపకం చేస్తువున్నాయి. నా కడుపులో పుట్టిన బిడ్డ....నా చేతుల్లో పెరిగినవాడు...యిక కళ్లకు కనిపించడని అనుకోవడమే దుర్భరంగావుంది...." ఆమెదీర్ఘంగా నిట్టూర్పువిడిచింది.... "వాడి జ్ఞాపకంగా నువ్వయినా యింట్లోవుంటావని అనుకున్నాను. స్వార్థమేననుకో! కానీ....పోనీలే! నువ్వయినా సుఖపడితే అంతకంటే కావల్సింది మరేముంటుంది. మాకు !... లేకపోతే...వొకటేకొరత.. నువ్వయినా కళ్లముందుంటా వనుకుంటే.... యెప్పుడయినా చూడాలనుకున్నప్పుడు వచ్చిపోతూ వుంటాను...ఆయింట్లో యిక నవ్వుతూ తిరిగే మనిషి కనిపించదేమో !...."

మానస బోరున యేడ్చేసింది. "నేనూ వచ్చేస్తానక్కడికి....నాకీ పెళ్ళొద్దు...నేను....నేను....యీపని చేయలేన్నేను...."వెక్కిళ్ళమధ్య మాటలు స్పష్టంగా పలకడంలేదు.

సరోజమ్మ కోడలి ప్రక్కకెళ్ళి కూర్చొంది. మానస ఆమె వొళ్ళోకి సోలిపోయింది. "నీకు వాడంటే యెంత యిష్టమో నాకు తెలుసు మానసా! కానీ... మొదట్లో యిబ్బందిగావుంటే వుండొచ్చు. కానీ యీ ఆరేడు నెలల నేరానికి జీవితమంతా శిక్షెందుకు అనుభవించాలి నువ్వు? చదువుకున్నదానివి...కష్టాలకూ నష్టాలకూ తట్టుకోవడం నేర్చుకోవాలి. కన్నతల్లిని... నేనే గుండె దిటవు చేసుకున్నాను. మేమే చెబుతున్నాముగదా! నువ్వేమీ మనస్సుకు కష్టం పెట్టుకోవద్దు... ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే వున్నాయి. అయినా వొక మంచిపని చేస్తున్నానన్న భావన ఆమెకు బాసటగా నిలబడింది. చెప్పదలచుకున్న విషయాన్ని వ్యక్తం చేయడంలో ఆమె సఫలీకృతురాలయింది.

"మనమొచ్చి యిప్పుడిప్పుడే పూరటపడుతున్న అమ్మాయిని మళ్ళీ కదిలించినట్టున్నాము." అన్నాడు చంద్రమౌళి. "యిక మేము వెళ్తామమ్మా...! అవతల ముంచుకుపోయే పనులేవీ లేవనుకో. కానీ...వెళ్ళాలి. యెప్పుడయినా



మమ్మల్ని చూడాలనుకుంటే...నీవెప్పుడైనా, యెలాటి స్థితిలోనయినా....నువ్వ క్కడికి రావచ్చునమ్మా! యీ విషయంలో సందేహాలు పెట్టుకోవద్దు నువ్వు... యిప్పటినుంచీ నీకు రెండు పుట్టిళ్ళున్నాయని అనుకో...సరేనా....?"

"వొక నిముషం అన్నయ్యగారూ! కాఫీ అయినా పట్టుకొస్తాను..." అంది అన్నపూర్ణ.

అతను మౌనంగా వుండిపోయాడు.

అన్నపూర్ణ వంటింటిలోకి వెళ్ళిపోయింది.

మానస సరోజమ్మ వొడిలోనే పడుకుని కళ్ళు మూసుకుంది.

కాస్సేపు ఆ గదిలో గడియారపు టక టకలూ, మానస వుచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దాలూ, సరోజమ్మ ముక్కు చీదుకుంటున్న సవ్వడీ, తప్ప మరో అలికిడి వినిపించలేదు.

"పరవాలేదులే రాజూ! వో అరగంట ముందుగా వచ్చినంత మాత్రాన మా యింట్లోవాళ్ళు మరోలా అనుకోరులే! రా లోపలికి..." అంటూ హాలులోపలి కొచ్చిన సాగర్, అతిథుల్ని చూడగానే ఆశ్చర్యపడిపోయి, అలాగే నిల్చుండి పోయాడు. వొకటి రెండు నిముషాల తరువాత తేరుకుని "నమస్తే! మీరెప్పుడొచ్చా రండీ" అంటూ నవ్వుతూ పలకరించడానికి ప్రయత్నించాడు,

"వో అరగంటయింది" అన్నారు చంద్రమౌళి.

"యితనేనండీ....రాజేష్...మీకు చెప్పానుగదా!" రాజేష్ చేయి పట్టుకుని ముందుకు లాగాడు.

రాజేష్ నమస్కరించాడు.

"నమస్తే ! నువ్వేనన్నమాట రాజేష్....రానాయనా ! యిలా కూర్చో...." సోఫాలో వొకప్రైపుగా జరిగి కూచున్నాడు చంద్రమౌళి.

మానస అత్తగారి వొళ్ళోంచిపైకి లేచి, సర్దుకుని కూచొంది. లోపలికి వెళ్ళాలో, లేక కూచునే వుండాలో తోచక కాస్సేపు తర్జన భర్జనలు పడి, వెళ్ళిపోవ డానికే నిశ్చయించుకుని పైకిలేచింది.

"పరవాలేదులే కూచోమనూ ! రావోయ్ రాజూ !" అంటూ కుర్చీలోకొచ్చి కూచున్నాడు సాగర్.

రాజేష్ సోఫాలో కూర్చున్నాడు.

మానస తలవొంచుకుని కూర్చొంది.

అన్నపూర్ణ కాఫీట్రే తీసుకొచ్చింది.

"మాక్కూడా వొకరవుండు కాఫీలు కావాలమ్మా. వో అరగంట తరువాత భోంచేస్తాం...." అన్నాడు సాగర్.

"నాకొద్దమ్మా ! యెందుకో అదోలావుంది...." అంది మానస,

"అదోలా అంటే యెలా ? వూరికే ఆలోచిస్తూకూచునివుంటావు. కాఫీ తాగు, అదే తగ్గిపోతుంది...." సాగర్ కసురుకున్నాడు.

"ముఖమంతా పీల్చుకుపోయింది. కొంచెం కాఫీ తాగమ్మా....తేలికబడు తుంది....." అంది సరోజమ్మ.

మానస తనకప్పునందుకుని టీపాయ్‌పైన వుంచింది.


అన్నపూర్ణ వంటగదిలోంచి మరో రెండు కప్పుల కాఫీ తీసుకొచ్చి, సాగర్‌కూ రాజేష్‌కూ అందించింది.

అరకప్పు కాఫీని బలవంతంగా మింగి, మిగిలిన కప్పును అలాగే వుంచే సింది మానస. కడుపంతా తిప్పుతున్నట్టుగా వుంది. నోరంతా చేదుగా, వికారంగా తోచింది. సోఫాకు ఆనుకొని కళ్లుమూసుకొంది.

"యేం చేస్తున్నావునాయనా నువ్వు ?" అంటూ ప్రశ్నించాడు చంద్ర మౌళి.

"పీడబ్ల్యూడీలో అసిస్టెంటు యింజనీర్నండీ....వోసారి నేనూ సాగర్ మీయింటి కొచ్చాము. మీరు మరచిపోయివుంటారు" అన్నాడు రాజేష్.

"నాకు జ్ఞాపకంలేదు....మీ అమ్మానాన్నా...."




"నాన్నగారు రిటయిరయిపోయారండీ....ఆయన లెక్చరర్‌గా పనిచేసేవారు. అన్నయ్య బ్యాంకు మేనేజరు....ప్రస్తుతం అమ్మానాన్నా అన్నయ్య దగ్గరే వుంటు న్నారు...."

మానస కూర్చోలేకపోతోంది.

వొళ్లంతా తోటకూరకాడలా తూలిపోతోంది.

అరిచేతుల్లోసైతం చెమట పోస్తోంది.

మీ నాన్నగారికి....మీ అమ్మా నాన్నా...వాళ్ళకీవిషయం తెలుసా?" చంద్ర మౌళి సందేహిస్తూనే అడిగాడు.

"యింకా చెప్పలేదండీ ...కానీ....వాళ్లు అభ్యంతరం చెబుతారని అను కోను....వొకవేళ చెప్పినా, నచ్చచెప్పగలనన్న ధైర్యం నాకుంది,

మానసకు గొంతుకలో గరళం యిరుక్కున్నట్టుగా అనిపిస్తోంది· తూలుతూ తూలుతూ, లేచి వంటగదిలోకి నడచింది.

"యేమిటే అమ్మాయ్....?" అన్నపూర్ణ కంగారుపడుతూ వెనకే పరు గెట్టింది.

"యేమయ్యిందమ్మా...?" ముఖం చిట్లించుకుని, గది లోపలికొచ్చాడు సాగర్.

"నిన్నటినుంచీ యిది మూడోసారి డోక్కోవడం....అప్పుడు రెండిడ్లీలు, యిప్పుడు అరకప్పు కాఫీ....తిన్నది అంతే! యిప్పుడు కడుపులో యేమీలేదు. తిండీ, నీళ్ళూ సక్రమంగా సమయానికి తిని రెండు నెలలవుతోందికదా! యెప్పుడు పిలిచినా ఆకలి లేదంటుంది. వొళ్ళో పసిరిక లెక్కువగావుంది. నిన్నటినుంచీ అనుమానంగావుంది నాకు....చూడు వొళ్ళంతా యెలా చెమటలు పోస్తున్నాయో!"

"చంద్రమౌళీ, సరోజమ్మా గదిలోకొచ్చి చూస్తూ నిల్చున్నారు.

"మరేం పరవాలేదులెండి....జాండిస్సేమోనని అమ్మ అనుమానం. యెందు కయినా మంచిది, డాక్టర్ని రమ్మని ఫోన్ చేస్తాను...." అంటూ సాగర్ హాల్లో కొచ్చేశాడు. ఫోన్ చేసిన తరువాత రాజేష్‌వైపుకు తిరిగి "అమ్మకు అన్నీపిచ్చి సందేహాలే! సందేహాల్ని తీరిస్తేగానీ ఆమెకు నిలకడుండదు. అందుకే ఫోన్‌చేశాను.

డాక్టర్ సుందరవల్లి....ప్రశాంతి నర్సింగ్‌హోం డాక్టరు....యిప్పుడే బయల్దేరు తున్నానన్నారావిడ" అన్నాడు.

టీపాయ్‌పైనుంచి యిలస్ట్రేటెడ్ వీక్లీ నందుకుని బొమ్మలు తిరగేయ సాగాడు రాజేష్.

సాగర్ మళ్ళీ లోపలికెళ్ళి పోయాడు.

అయిదు నిముషాల తరువాత తిరిగొచ్చి "మేడపైకెళ్ళి కూచుందామా? అక్కడయితే హాయిగా వుంటుంది. నా పుస్తకాలో నొకసారి గాలించే వీలుంటుంది నీకు.... ' అంటూ రాజేష్‌ను పరామర్శించాడు.

"ఫర్వాలేదులే సాగర్.... డాక్టరుగారొస్తున్నారుగదా! యిక్కడే వైట్ చేస్తాను" అన్నాడు రాజేష్.

డాక్టరు యింటికి రావడానికి మరో పదిహేను నిముషాలు పట్టింది.

గదిలోంచి అందర్నీ బయటికి పంపి, పరీక్ష చేయసాగింది డాక్టరు.

ఆమె వెలుపలికి రాగానే "అమ్మ జాండిస్సేమోనని అనుకుంటోంది డాక్టర్! యీజిట్ ట్రూ ?" అంటూ ఆమెను ప్రశ్నించాడు సాగర్.

"మీరోసారి అలారండి...." అంది డాక్టర్ సుందరపల్లి.

"యింకా చిన్నపిల్ల గదండీ! యేవేవో ఆలోచిస్తూ కూచుని సమయానికి భోజనం చేయడం లేదు. వారాలతరబడీ యిలా చేస్తే యేమవుతుంది చెప్పండి ? రెండుసార్లు వామిటయింది. అందుకని...."

"సాగర్.... " డాక్టర్ అడ్డు తగిలింది. ఆమె కనుబొమలు ముడిపడ్డాయి నుదుటిపైని చెమట బిందువుల్ని తుడుచుకుంటూ "ఆమెకు జాండిస్ అటాక్‌గాలేదు" అంది.

"థాంక్ గాడ్!.... అలాంటిదేమీ లేదని నాకు తెలుసునండీ! కానీ సందేహం తీరినట్టవుతుందని మిమ్మల్ని రమ్మన్నాను...."

"కానీ సాగర్...."

"మీకు చాలా శ్రమిచ్చాను...."

"వైయ్యార్యూ యిన్ సచ్యే హర్రీ...." ఆమె విసుక్కొంది. "చెప్పేది వినిపించుకోవెందుకు ? నౌ షీ యీజ్ ప్రెగ్నెంట్.... నేను అడిగేవరకూ ఆమెకు సైతం యీ సందేహం రాలేదు. అయ్ థింక్ దిస్ యీజ్ థర్డ్‌మన్త్. యిది మూడో నెలయివుండొచ్చు...."

## 6

'ఆలోచన- అనే వరం మానవుడి కొక్కడికి మాత్రమే లభించింది. యెవరా మాట అన్నది ? జీవితమంటే వేదికలెక్కి వుపన్యాసాలు దంచడం కాదు. చేతికో కలమూ కాగితమూ దొరికాయి గదా అని ఆదర్శాలు కుప్పించడంగాదు. జీవిత మొక పరీక్ష. ఆలోచనా సర్పదష్టులపాలిట మృత్యుపానుపు. ఆలోచన వరం కాదు. అది శాపం. మానవుడనే అమాయిక ప్రాణిని నిరంతరం వేటాడే క్రూరమృగం - ఆలోచన. ప్రతి క్షణం నేనున్నానంటూ ప్రత్యక్షమయ్యే నక్షత్రకుడి అవతారం - ఆలోచన. మనిషి వొంటరిగా దొరికితేచాలు, తోడుగా నేనున్నానంటూ భుజంపైన చేయివేసి, వూబిలోకి లాక్కెళ్ళిపోయే నయవంచకురాలు - ఆలోచన. డామ్నిది థింకింగ్.... డ్రైవ్ దిస్ అఫ్...."

రాజేష్ ఆఫీసునుంచి వొక ఫర్లాంగు దూరమయినా రాలేదు. గదికెళ్ళడానికి యింకా రెండుమూడు మైళ్లు వెళ్ళాలి. మోటార్ బైకును స్లో చేసి, హేండ్లూ యెగ్జిబిషన్ వైపుకు మళ్లించాడు.

యెగ్జిబిషన్ గ్రౌండుకు ముందు ట్రాఫిక్ జామ్.... తొందరగా లోపలికి వెళ్లడం కోసం తొక్కిసలాట.... పార్కింగ్ ప్లేస్‌లో రకరకాల వాహనాలు.... యిక్కడ జరుగుతున్నది కొంపదీసి మోటర్‌వాహనాల యెగ్జిబిషన్ కాదుగదా !.... ముసలివాళ్లు, నడివయసు సంసారులు, యువదంపతులు, కాలేజీకుర్రాళ్లు, కురాళ్లు.... యెటు చూసినా జనం....

మోటర్ బైకును పార్క్‌చేసి లోపలికి నడిచాడు. మానవ సాగరాన్ని కొచ్చిన తుఫానులో, విసురుగా ముందుకురుకుతున్న వో కెరటపు తాకిడికి విరుచుకు పడుతూ కదులుతున్నాడు.

"యేయ్ ! యెవరది ? .... కళ్లు కనిపించడం లేదా ? యెందుకలా ముందుకు తోస్తావ్ ?.... చెబుతుంటే వినిపించుకోవేమిటి ?...."

హోరులో అతడి గొంతుక అతడికిసైతం వినిపించడంలేదు.

'యెందుకింత సంరంభం ? యెందుకింత ఆరాటం ? యిదిగో వోల్డుమాన్, యిందుకంత తొందర? నీ వాకింగ్ స్టిక్ జాగ్రత్త! యేం కొంటావయ్యా యిక్కడ ఆర్యూకిమింగ్‌టూపర్చేజ్ యే బ్రెవుడ్ ఫర్ యూ....యిదిగో పంజాబీ, పిల్లా ? ఆ షర్వాణీ కాస్తా కిందికి లాక్కో, యిది నీ అందానికి యేర్పాటు చేసిన ఫాషన్! పరేడ్ కాదు.... యిదిగో లిటిల్ యేంజిల్.... జాగ్రత్త ! తప్పిపోయిన వాళ్లకోసం ఆనౌన్సుమెంటు వింటూనే వున్నావు కదా ! మళ్లీ యెందుకలా మీ అమ్మానాన్నల్ని వదలిపెట్టి పరిగెత్తావు ? హాయ్, అమ్మాయ్ ; యిక్కడికొచ్చింది యెగ్జిబిషన్ చూడ్డానికి -అంతేగానీ, నీ ప్రియుడి భుజంపైన వాలిపోయి సరాగాలు పోవడానికి కాదు. యిది బెడ్రూమని అనుకుంటున్నారా మీరు ? చుట్టూ యిందరం చూస్తూనే వున్నాము, కనిపించడం లేదా మీకు? హాలో అబ్బాయ్ ఆ కోతిముఖంలో యేముందని అలా చూస్తూ పరవశించి పోతున్నావు ? నీకే గనుక మానసలాంటి పిల్లదొరికితే యిక.... మానస.... యెంత అందమైన అమ్మాయి ! యేదీ యిక్కడ యింతమంది గుమికూడారుగదా, వొక్కరయినా అంత బావున్నారా ? ....లేదు.... మానసే మానస.... తేడా దృష్టిలోనేగానీ, సృష్టిలో లేదని తప్పించుకోవాలనుకుంటున్నారేమో ! నే నొప్పుకోను.... లోపం మీదృష్టిలోనే వుంది.... యేయ్ బాబూ ! మీ అమ్మచేయిపట్టుకో యెందుకలా పరిగెడతావు నువ్వు ?.... మానస.... మానసకు సైతం.... మళ్లీ అవే ఆలోచనలు .... మనిషి నీకు సుఖంలేదు.... నీ బ్రతుకింతే?.."

రాజేష్ వో సెంటులోకి దూరేశాడు.

రంగురంగుల బట్టల చుట్టూ రకరకాల - మనుషులు....

యెక్కడాస్థలం కనిపించడం లేదు....

వో చివర్లో, పొరబాటున వొక కౌంటరు ఖాళీగామిగిలిపోయి కనిపించింది.

వెళ్ళి నిల్చున్నాడు.

"లాల్చీ, పైజామా.... సెవన్టీ రుపీస్‌సార్.... ట్వంటి పర్సెంట్ రిబేట్...."

"చూపెట్టండి...."

"దీస్ ఆర్ మేడ్ యిన్ రాజస్థాన్ సార్! నైస్ వెరయిటీ....నియర్లీఫిఫ్టీ పర్సెంట్ ఆర్ సోల్డ్ అవుట్.. "

తల పైకెత్తి చూశాడు.... ఎర్రటి ఛాయ.... వొత్తయిన వెంట్రుకలు.... తెలుగువాడై వుండడు.

"గివ్‌మీ వనపెయిర్...."

చక చకా కవర్లో సర్ది, బిల్లు తయారు చేశాడతను. యంత్రంలా కదులుతున్న అతడి వ్రేళ్ళవైపే ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు.

"హావ్యూ సీన్ ది రాజస్థానీ సారీస్ సార్! డోన్ట్‌మిస్‌దెమ్.... యువర్ బెటర్ హాఫ్ విల్‌బీ ప్లీజ్‌డ్...."

"అయామ్ యే బాచిలర్ యూసీ...." అడ్డు తగిలాడు.

వో క్షణం సేపు రాజేష్‌వైపు చూసి, అదోలా నవ్వి, ముందుకు కదిలాడు అతను.

'బాచిలర్ అయితే మాత్రం? మానసకోసం వొక చీర యెందుకు కొనకూడదు తాను? చీరలకే అందం మానస.... మానసకోసం వొక బహుమతి....'

"దీస్ ఆర్ ది చిల్డరన్స్ గార్మెంట్స్...." యెవరో అరుస్తున్నారు.

మానసకయితే చీర కొంటున్నాడు.... మరి....? వీల్లేదు.... తనచేతగాదు.... తాను భరించలేడు.... ఛీ.... గాలయినా రావడంలేదిక్కడ.... వొళ్ళంతా చెమటలు పోస్తున్నాయి. బయటికెళ్ళి పోవాలి.... యేమిటీ, వన్ రుపీ చేంజ్‌కావాలా, లేక పోతేపోనీలే, పాకెట్టిలాయివ్వు...'

సెంటు బయటకొచ్చి, వెనుదిరిగి చూడకుండా బయటికొచ్చేశాడు. వాహనాలమధ్య తన మోటారు బైకును పసిగట్టి, బయటికి తీయడానికి పదిహేను నిముషాలు పట్టింది. అడ్డంవచ్చిన వ్యక్తినల్లా మనసులోనే తిట్టుకుంటూ మోటారు బైకును రోడ్డుపైకి లాక్కొచ్చాడు.

కిక్కర్‌పై బూటుకాలు విసుగ్గాపడింది

వాహనం కదిలింది.

'వొంటరితనం దుర్లభం.... మనుష్యులమధ్య నరకం.... నీరలా మధన... యెందుకిలా సతమతమై పోతున్నాడు తాను? యిప్పుడేం జరిగిందని? యింకా తాను యే వూబిలోనూ దిగబడి పోలేదుగదా....! మరి యెందుకిలా బాధపడాలి...? యింతకూ తానిప్పుడేంచేయాలి? తాను సుఖపడటంకోసం తానేం చేయాలి...?

## రుద్రభూమిలా

వర్తమానం
నానా రకాల అంటురోగాలుతాకి
ఈ గల్లి తోలుతూ
మంచంపై మూల్గుతున్న వ్యాధిగ్రస్తలా ఉంది
వర్తమానం
ఛిన్నహింసాప్రవృత్తుల కత్తిపోట్లకుగురై
గాయాలతో

దుఃఖిస్తున్న క్షతగాత్రలా ఉంది
వర్తమానం
రాక్షస దౌష్ట్యకామప్రకోపనకుబలై
శీలం కోల్పోతున్న కులకాంతలా ఉంది
వర్తమానం
దళారీల సేవలో సర్వస్వం కోల్పోయి
అస్తిపంజరమై
చావుకెదురుచూస్తున్న శ్రమజీవిలా ఉంది
వర్తమానం

ఎవడి ఆలోచన అరువుతెచ్చుకొని
తన ఇంటికే నిప్పంటించి
పగలబడి నవ్వుకుంటున్న అజ్ఞానంలా ఉంది
వర్తమానం
సాటిమనిషిపై ద్వేషంకక్కి
సౌజన్యానికి సమాధికట్టి
ఘోరమారణకాండ కొడిగట్టి
రక్తం తాగుతున్న ఉన్మాదంలా ఉంది

వర్తమానం భీభత్సంలా
వర్తమానం విషాదంలా
వర్తమానం కాలనేమిలా
వర్తమానం రుద్రభూమిలా
అబ్బా!
వర్తమానం
ఈ
వర్తమానం!!

**తిరునగరి**

యేది తనకిష్టం....తనకు తానే వొక 'పజిల్'గా తయారయిపోతున్నాడు... తనకు కావలసిందేమిటి... ? యింతకూ తననివ్వుడు వేధిస్తున్నసమస్యయేమిటి....? అంతా అస్పష్టంగా కనిపిస్తోందెందుకు....'

మోటారు బైకును కాస్సేపు స్లో చేసి, సిగరెట్టు వెలిగించుకున్నాడు.

ధ్యాసను సిగరెట్టు రుచిని ఆస్వాదించడం వైపుకు మరల్చడానికి ప్రయత్నించాడు.

ప్రొద్దుటినుంచీ చాలా సిగరెట్లే తగలేసినట్టున్నాడు, నోరంతా చేదుగా వుంది. సిగరెట్టు సయితం వెగటుగా తోస్తోంది.

వేడివేడి నిట్టూర్పులు వదులుతూ మోటార్‌బైకు గదిముందు ఆగింది.

స్టాండు లాగుతూ, గదివైపుకు తిరిగిన అతడు కాస్సేపు అలాగే ఆగిపోయాడు.

గది తలుపులు తెరచివున్నాయి.

డూప్లికేటు తాళం చెవి సహాయంతో, గదిలోకి వెళ్ళగలిగిన యేకైక వ్యక్తి యెవరో అతనూహించుకోగలిగాడు.

కంగారుగా సిగరెట్టు పీకను విసిరిపారేసి, గదిలోకి తొంగి చూశాడు.

గొంతు సవరించుకుని,"యెప్పుడొచ్చావన్నయ్యా?" అంటూ పలకరించాడు.

వాలుకుర్చీలో కూర్చున్న మురళి 'ఫైనాన్స్ రిపోర్టు'లోంచి తలపైకెత్తాడు. పత్రికను మడిచిపెడుతూ, "మీ ఆఫీసులో నీచేత వోవర్‌టైం మాత్రమేగాకుండా నైట్‌డ్యూటీ కూడా చేయిస్తున్నారన్నమాట!" అన్నాడు.

రాజేష్ మంచంపైన కూర్చుని, ముద్దాయిలా తల వంచుకున్నాడు– "అంటే, నిన్ననే వచ్చావా నువ్వు?...."

"నిన్న సాయంకాలం నాలుగింటికి...."

"డ్యాం సర్వేకోసం వెళ్ళాను. రెండు మూడు రోజులుగా తీరికలేదు. నిన్న అక్కడే యేడయిపోయింది. యిక మళ్ళీ సిటీకొచ్చే వోపిక లేక, గెస్టుహౌస్‌లోనే పడుకున్నాను. యీరోజు మధ్యాహ్నానికిగానీ పని పూర్తికాలేదు. ఆఫీసుకెళ్ళి, ఫైళ్లు సబ్మిట్ చేసి, నేరుగా గదికే వస్తున్నాను...." కాస్సేపు ఆగి, మళ్ళీ చెప్పసాగాడు— "నువ్వు వస్తున్నావని నాకు తెలియదుగదా! నువ్వు ఉత్తరం గూడా రాయలేదు...."

మురళి మాట్లాడలేదు.

"అమ్మా నాన్నా బావున్నారా?.... వదినా, పిల్లలూ .. "

మురళి తల వూపాడు.

యేదో వొకటి మాట్లాడడంకోసం కాస్సేపు మాటల్ని వెతుక్కొని, "వచ్చిన పని పూర్తయిందా?" అంటూ రాజేష్ మళ్లీ తానే ప్రశ్నించాడు.

"యేపని?" తమ్ముడివైపు చురుక్కుమనిపించే చూపుల్ని ప్రసారం చేశాడు మురళి.

పరధ్యానంగా గురిపెట్టిన బాణం, వెనుదిరిగి తననే ఢీకొన్నట్టనిపించడంతో, రాజేష్ తికమక పడిపోయాడు. "మీ హెడ్డాఫీసులో యేదో పనుందన్నావుగదా!.... అదే.... అప్పుడప్పుడూ నీకు యేవేవో పనులుంటాయిగదా అక్కడ.... అందుకోసం వచ్చావేమోనని...."

"యీసారి నేనొచ్చింది ఆఫీసు పనిపైనగాదు.... " మురళి చిరునవ్వు నవ్వాడు.

'అమ్మయ్య!' అనుకొని, వోసారి వూపిరి పీల్చుకున్నాడు రాజేష్– "మరి.... ?"

"నాన్న ఉత్తరం రాశానన్నారు...."

"యే వుత్తరం?...."

"ఆదేరా, నీ పెళ్ళిగురించి...."

"..........."

"వెళ్లి ముఖం కడుక్కొని దుస్తులు మార్చుకో...."

రాజేష్ కేమీ అర్థంకాలేదు.

"యీవూళ్లోనే వో సంబంధముందట! నాన్నకెవరో స్నేహితుడు ఉత్తరం రాశాడు. నీతోబాటూ వెళ్ళి చూసిరమ్మని నాన్నగారి ఫర్మానా...."

"........"

"యీ రోజు వుదయం పదిగంటలకంతా వాళ్లింటి కొస్తున్నామని నాన్న వుత్తరం కూడా రాసేశారు. నువ్వేమో సమయానికి కంటికి కనిపించకుండా పోయావు ...వుదయం నేను ఫోనుచేశాన్లే.... యెలాగయినా సాయంత్రానికి నీతో బాటూ వాళ్లింటికొస్తున్నానని...."

"........"

"పెళ్లి తొందరగా బయల్దేరు...."

మాసిన బట్టల్ని విప్పి హేంగరుకు తగిలించి, స్నానం చేయాలన్న మిషతో రాజేష బాత్రూంలోకి దూరేశాడు.

'యెదురయిన మొదటి సమస్యను పరిష్కరించుకోవడమెలాగో తెలియక తాను తికమక పడిపోతున్నాడు. యింతలో మరో సమస్య. కాల్చిన యినుప ముక్కకే సమ్మెటదెబ్బలు తగులుతున్నట్టుగా పరీక్షపైన మరో పరీక్ష.. పెళ్లిచూపులకు యిప్పుడే వెళ్లాలా తాను? యీ అన్నయ్యొకడు! యిప్పుడే రావాలా వీడుగూడా? మొదటి సమస్యకు అన్నయ్య రాకడే పరిష్కారం కాదుగదా! యేగొడవలూలేని కొత్త సంబంధం....అపరిచితురాలయిన ముగ్ధ....కావలిస్తే కోరినంత కట్నం డబ్బులూ....సుమధురస్వప్నం లాంటి జీవితం....అదర్శం పొగమంచు లాంటిది... పట్టుకోవాలన్న తాపత్రయం తనకెందుకు?....అదిగో, మళ్లీ తాను సైతానుకు లొంబడిపోతున్నాడు సాగర్ కేమని సమాధానం చెప్పాలి?....అత్మను చంపుకుని బ్రతకడం తన చేతనవుతుందా? అయినా యేమిటీ పరీక్ష? వోపికగా అలోచించుకునే సమయమయినా తనకెందుకు దొరకదు? యేంచేయాలి తాను?.... తానేం కోరుకుంటున్నాడు? తనకు తానే వొక్క చిక్కుముడిలా తయారైపోతున్నాడెందుకు? వొకముడివిప్పేసరికి, మరో కొత్త ముడిపడిపోతోంది....'

టవలుతో ముఖం తుడుచుకుంటూవచ్చి, మంచంపైన కూర్చున్నాడు రాజేష్.

"లేచి తొందరగా బయల్దేరు....పాంటూ, షర్టూ తొడుక్కుని సిద్ధంగా కూర్చున్న మురళి హెచ్చరించాడు.

"యిప్పుడే వెళ్ళితీరాలా అన్నయ్యా!" రాజేష్ తాపీగా అడిగాడు.

"మరి....?" మురళికి తమ్ముడిధోరణి అర్థం కాలేదు. "పొద్దున్నే వెళ్ళాల్సినవాళ్ళం! యిప్పటికే అలస్యం అయిపోయిందని నేను కంగారుపడుతున్నాను..."

"అదికాదూ..." రాజేష్ సాగదీశాడు.

యేదికాదు...ముందు నువ్వు బయల్దేరు చెబుతాను...." తాను పైకి లేచి నిల్చున్నాడు మురళి. ,

"కాస్సేపు కూర్చో అన్నయ్యా! వొకమాట...!"

"యేమిటోరా నీసంగతి అంతా అయోమయంగావుంది. అవతల అమ్మా, నాన్నా యిప్పటికే అలస్యమైపోయిందని గగ్గోలు పడుతున్నారు. అప్పటికి నాన్న చెప్పనే చెప్పారు నువ్వెలాగయినా యెగనామం పెడతావని. యెలాగో వొకలా నిన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత నాదేనని మరీ మరీ చెప్పింది అమ్మ. నువ్వేమో యిలా బిగమొండిలా తయారై కూచున్నావు. యింతకూ నువ్వు పెళ్ళి చేసుకోదలచుకున్నావో లేదో ఆ సంగతి తేల్చిచెప్పు..." మురళి చికాకుపడుతూ కూర్చున్నాడు.

"నువ్వెలా కోప్పడితే యెలా చెప్పు? నేను పెళ్లి చేసుకోనని అన్నానా యెప్పుడయినా?...."

"మరి యిప్పుడు బయల్దేరడానికి అభ్యంతరమేమిటి?"

"అది కాదన్నయ్యా! యిదేదో వొక ఆటలా మనం పెళ్లి చూపులకు వెళ్లడమెందుకు? వెళ్లడమూ, చూడడమూ, నచ్చలేదని వాళ్లకు ఆశాభంగం కలిగించడమూ - యెందుకివన్నీ? ఆడపిల్లల కేర్పడిన నిస్సహాయ పరిస్థితిని అసరాచేసుకుని యిలావాళ్లను యేడిపించడం బావుంటుందా"?

"నువ్వు చెబుతున్నదేమిటో నాకు అర్థం కావడంలేదు. అమ్మాయిని చూడకముందే నచ్చదని అనుకుంటున్నావేమిటి? యింతకూ....కొంపదీసి, నువ్వింకో అమ్మాయినెవరినయినా...."

"అబ్బెబ్బే. అదేం లేదు...తడబడిపోయాడు రాజేష్.

"కొత్తగా సంబంధాలూ చూడకుండా, నీకు నువ్వుగా యెవరినీ యెన్నుకోకుండా, యెలా పెళ్ళి చేసుకుందామనుకుంటున్నావు మనూ నీకేమయినా పిచ్చెక్కిందా....?"

"అదికాదన్నయ్యా"

గది బయట మోటారుబైకు ఆగిన శబ్దం వినిపించింది.

రాజేష్ పైకి లేచి, కిటికీలోంచి అవతలికి చూశాడు.

సాగర్ లోపలికొచ్చాడు.

సరిగ్గా సమయానికి ఆపద్బాంధవుడిలా అతడిలా రావడంతో, తనకీ ప్రమాదంనుంచీ తప్పించుకునే అవకాశం దొరుకుతోందనుకుని, రాజేష్ హాయిగా నిట్టూర్చాడు. "అన్నయ్యా, యితనే సాగర్....నీకు చాలాసార్లు చెప్పాను...." మిత్రుడ్ని పరిచయంచేశాడు.

"నమస్తే, రండి, రండి....కూచోండి" కుర్చీ చూపెట్టాడు మురళి.

"నమస్తేనండీ....మీరు ఆఫీసు పనిమీద చాలాసార్లు యిక్కడికొచ్చారట కదా! ఒక్కసారయినా నాకు మిమ్మల్ని చూపెట్టలేదు మీ తమ్ముడు..."అన్నాడు సాగర్.

"వీడికెప్పుడేం చేయాలో తెలియదులెండి!" మురళి తమ్ముడికి తప్పించుకునే అవకాశాన్నివ్వలేదు. కొత్తగా పరిచయమైన వ్యక్తిని తన కేసుకు న్యాయమూర్తిగా మార్చుకుని, తన వాదనను కొనసాగించాడు.

వయసొచ్చిందిగానీ, బుద్ధిమాత్రం రాలేదు వీడికి. యెలాగూ సమయానికొచ్చారుగదా, మీరైనా నచ్చజెప్పండి మీ స్నేహితుడికాస్త...."

పెనంపైనుంచీ పొయ్యిలోకొచ్చి పడ్డానన్నసంగతి అర్థం గావడంతో రాజేష్ కంగారుపడిపోసాగాడు.

కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ, "యేమిటి రాజేష్? యేమిటీ కంప్లయింటు?" అంటూ చిరునవ్వు నవ్వాడు సాగర్.

తనూ నవ్వడంకోసం విఫల ప్రయత్నంచేశాడు రాజేష్.

"వాడేం చెబుతాడ్లెండి! నేనే చెబుతాను....యింటిదగ్గర మా అమ్మా నాన్నా వీడికి పెళ్ళెప్పుడు జరుగుతుందా అని బెంబేలు పడుతున్నారు. వీడేమో యే సంబంధాన్ని చూపెట్టినా యేదో వొక వంక పెడుతున్నాడు. మా నాన్న యీవూళ్లోనే వొక సంబంధముందనీ, వెళ్ళి చూసి రమ్మనీ నన్ను పంపారు. సమయానికి సెలవులుగూడాలేవు నాకు. అయినా యెలాగోలా తంటాలుపడి నేనొస్తే. వీడు ససేమిరా కదలనని మొరాయిస్తున్నాడు. మేము వస్తున్నామని వాళ్లకు ఫోనుగూడా చేశాను! పోనీ, యింకెవరినైనా పెళ్ళిచేసుకోవాలని అనుకుంటున్నావా చెప్పమంటే, అదేమీ లేదంటాడు. కాలికేస్తే చేతికి, చేతికేస్తే కాలికి-అదీ సంగతి.... యేంచేయాలో తోచడంలేదు నాకు...."

సాగర్ సైతం గ్రుక్కిళ్ళు మింగసాగాడు.

"రాజేష్ మీగురించి చాలాసార్లు చెప్పాడు. మీరిద్దరూ చాలా క్లోజ్ ఫ్రెండ్సుగదా! మీకు తెలిసేవుంటుంది. వీడెవరినైనా ప్రేమించడం, కలిసితిరగడం లాంటి పనులేమయినా చేస్తున్నాడేమో చెప్పండి. యెవరయినా మాకెవరికీ అభ్యంతరంలేదు. అమ్మాయి చక్కగా చదువుకుని, బుద్ధిమంతురాలైతే చాలు....! మీరైనా చెప్పండి...."

"నాకుమాత్రం యేం తెలుసు చెప్పండి" ప్రమాదాన్ని తప్పించుకోవడం కోసం తాను చేతులుపైకెత్తేశాడు సాగర్. "మీ అన్నయ్యతో చెప్పడానికి భయ

మెందుకు? చెప్పు రాజేష్! యింతకూ నీ అభ్యంతరమేమిటి....?"

"నా అభ్యంతరమా....? అది....అది...." తనను తప్పించడానికి బదులుగా, బోనులో కెక్కించి, తమాషాచూడాలనుకుంటున్న మిత్రుడివైపు కొర కొరా చూడసాగాడు రాజేష్—"అదేమీలేదు.... పెళ్ళిచూపులు చూడ్డం నాకిష్టం వుండదు...."

"యెందుకని? "మురళి క్రాస్ యెగ్జామినేషన్ మొదలుపెట్టాడు .

"యెందుకంటే...పుత్ర పుణ్యానికి ఆడపిల్లల్ని ఇంటర్వ్యూ చేయడమెందుకని.

"పుత్ర పుణ్యానికికాదు. పెళ్లి చేసుకోవడం కోసం యింటర్వ్యూ చేస్తున్నావు.."

"చూడడమూ, యిష్టంలేదని చెప్పడమూ బావుండదు...."రాజేష్ చిన్న పిల్లాడిలా మూతి పెట్టేశాడు.

"చూడకుండానే యిష్టం కలగదని యెలా అనుకుంటున్నావు? అంటే.... మరెవరినో యిష్టపడుతున్నావని అర్ధమవుతోంది...."

"అలాంటిదేమిలేదు...."గింజుకోసాగాడు రాజేష్.

"చూశారా సాగర్ ! యిదండీ పరిస్థితి.... వీడి తలతిక్క నెలాకుదిరించాలో తోచడంలేదు. యీ జబ్బుకు మందుంటుందంటారా?

సాగర్ మౌనంగా వుండిపోయాడు.

"యిప్పటికిప్పుడు బయల్దేరమంటే యెలాచెప్పు?యిదేమి చిన్నవిషయం గాదుగదా! నాకు ఆలోచించుకోడానికి కొంచెం సమయం కావాలి.."అన్నాడు రాజేష్.

"కొంచెం అంటే యెంతో అది కూడా నువ్వే చెప్పు?...."

"రేపు వుదయం చెబుతాను ..."

"మళ్ళీ రేపటికి పోస్ట్‌పోన్ చేస్తున్నావన్నమాట! అంటే నేను రేపు కూడా యీ వూళ్ళోనే వుండాలి. సెలవులెక్కడున్నాయి నాకు ?

"రేపు చెబుతాను...."

"వోకే.... రేపటివరకూ వెయిట్ చేస్తాను. యెలాగోలా సెలవు అడ్జెస్టు చేయమని బ్యాంకుకు వైరిస్తాను. రేపు ఉదయం పెళ్లిచూపుల కెళ్తున్నాం మనం. సరేనా?.... యేమండీ సాగర్‌గారూ మీరే సాక్ష్యం... "

సాగర్ నవ్వడానికి ప్రయత్నించాడు.

"సునీల్ నగర్ కాలనీలో నాకో ఫ్రెండున్నాడు. కనీసం వాణ్నయినా కలుస్తా నివ్వాళ. యీసమయంలోనయితే వాడింటి దగ్గరే వుంటాడు నేను వెళ్తాను. యీలోగా నాకు మీరో సహాయం చేసిపెట్టాలి. వీడి వాలకం చూస్తే యేదో దాస్తున్నాడన్న అనుమానం కలుగుతోంది. నాతో చెప్పడానికి సందేహిస్తున్నట్టున్నాడు. వీలయితే మీరోసారి కదిపి చూడండి...."

"అలాగేనండి" అన్నాడు సాగర్.

బూట్‌లేసులు బిగించుకుని పైకిలేచాడు మురళి.

"కావలిస్తే నా మోటర్‌బైక్ తీసుకెళ్ళన్నయ్యా!" తాళం చెవి మురళి చేతి కందించాడు రాజేష్.

మురళి బయటికెళ్ళిపోయాడు.

మోటర్ బైకు బయల్దేరిన శబ్దం వినిపించింది.

అయిదు నిమిషాలసేపు యిద్దరూ మౌనంగా కూచున్నారు.

రాజేష్ పైకిలేచి, బట్టలు తొడుక్కున్నాడు.

తాళం కప్ప చేతి కందుకున్నాడు.

సాగర్ వెలుపలికొచ్చి తన వాహనాన్ని స్టార్టు చేశాడు.

గది తలుపులకు తాళం బిగించి, మోటర్‌బైకు వెనకసీటు పైకొచ్చి కూర్చు న్నాడు రాజేష్.

పదిహేను నిముషాల ప్రయాణం సాగిన తరువాత, మోటర్‌బైకును స్లో చేసి, వెనుదిరిగి చూసి, "మనమిప్పు డెక్కడి కెళ్తున్నాం" అంటూ చిరునవ్వు నవ్వాడు సాగర్.

"యేమో, నాకేం తెలుసు?" రాజేష్ మిత్రుడి ముఖం కేసి చూడలేక పోయాడు.

మరో పదినిముషాల ప్రయాణం తరువాత వాహనం రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆగింది.

"యిక్కడి కెందుకొచ్చాం మనం?" అంటూ కిందికి దిగాడు రాజేష్.

"వోసెట్టు లాగిద్దామని...." అన్నాడు సాగర్.

"యిప్పుడా?"

"......"

"మూడ్ లేదునాకు...."

"......"

"నీతో కొంచెం మాట్లాడాలి...."

"నాతోనా?!"

"......"

"అలా లాన్‌లో కూచుందాం...."

క్లబ్బు ప్యూను లాన్‌లోకి గార్డెను చేర్సు తీసుకొచ్చి వేశాడు. వేడి వేడి చాయ్ తెచ్చిపెట్టాడు.

సిగరెట్టు వెలిగించుకుని, తాపీగా వొక దమ్ములాగి "మీ అన్నయ్యేమో నన్ను అడిగి తెలుసుకోమంటున్నాడు. నువ్వు నాతో మాట్లాడాలంటున్నావు. యీ రెండింటిలో ఫస్టు ప్రిఫరెన్సు దేనికిద్దాం చెప్పు?" అన్నాడు సాగర్.

"అవి రెండూ వేర్వేరు విషయాలుగావు." రాజేష్ విసుగ్గా అడ్డు తగిలాడు. "అయినా నిమ్మకు నీరెక్కినట్టుగా నువ్విలా తయారయ్యావెందుకు? అన్నీ తెలిసిగూడా యిలా చేతులు పైకెత్తేస్తే నా సంగతేం కావాలి?"

"నేనా? నేనేం చేశాను?" సాగర్ కంగారు పడిపోయాడు.

కోపాన్ని బలవంతంగా అణచిపెట్టుకుని, వీలయినంత ప్రశాంతంగా మాట్లాడడానికి ప్రయత్నించాడు రాజేష్— "ఆవేళ మీ యింటి దగ్గరినుంచీ వచ్చినప్పటినుంచీ నేనెంతగా మధనపడిపోతున్నానో తెలుసా నీకు? కాళ్ళ కింద భూమి తొలుచుకుపోతున్నట్టుగా తోస్తోంది నాకు. నేనూ మానవుణ్ణేగదా! నా బాధని సైతం నువ్వర్థం చేసుకోవాలి. మనిషిమనిషిగా ప్రవర్తించడం సాధ్యమేగావచ్చు, కానీ...."

"నువ్వు మరింత విపులంగా చెబితే బావుంటుంది..."

"యింతకంటే విపులంగా చెప్పడం నాచేతగాదు. నువ్వు కాస్త అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. మొన్నటి ఆ సంఘటనే జరగకుండా వుంటే, యివ్వాళ మా అన్నయ్యతో యీ సంగతి స్పష్టంగా చెప్పేవుండేవాణ్ణి! కానీ.... అదిమాత్రం నాచేతగాదు...."

"... ...."

"నువ్వు 'హామ్లెట్' నాటకం చదివావుకదా! నన్నుమాత్రం 'క్లాడియస్' కమ్మని చెప్పొద్దు.... నా చేతగాదు...."

"మరి.... మరి.... "

"యింతకంటే స్పష్టంగా యెలా చెప్పగలను సాగర్?" విధివంచితురాలైన అమ్మాయిని సానుభూతితో చూడగలను. ఆవిడను పెళ్ళిచేసుకోగలనుకూడా! కానీ మొదటిపెళ్ళికి సాక్ష్యంలా కనిపించే బిడ్డనుమాత్రం భరించలేను. వొక 'హామ్లెట్'ను అనుక్షణం చూస్తూ, అతడి వేదనను గమనిస్తూ బ్రతకలేను. కావలిస్తే, వొక బిడ్డ తల్లిని సానుభూతితో చూడగలను. కానీ పెళ్ళి చేసుకోవడం....ప్లీజ్ సాగర్.... నన్ను అర్థంచేసుకోవడానికి ప్రయత్నించు....ఆపనిమాత్రం నేను చేయలేను...."

"నువ్విలా మాట్లాడుతావని నేననుకోలేదు." సాగర్ కలవరపడిపోయాడు.

నా బాధేమిటో నీకు అర్ధమయినట్టులేదు. నేను మానసను పెళ్ళిచేసుకోనని అనడంలేదు....చేసుకుంటాను. కానీ ఆమె మరెవరిబిడ్డకో తల్లికావడం నేను సహించ లేను. కాబట్టి .. అందుకని...."

"అందుకని?" సాగర్ రెట్టించాడు.

"ఆ ప్రమాదం జరక్కుండా చూడడమెలాగో నీకూ తెలుసు. మళ్ళీ నా నోటితో చెప్పించడమెందుకు?"

( ఇంకా ఉంది )